ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నంద్యాల
జిల్లా వార్తలు
గురువారం 16 మే 2024

నంద్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): 'కోర్టులో ఓడినవారు అక్కడే ఏడుస్తారు.. గెలిచిన వారు ఇంటి దగ్గర ఏడుస్తారు' అన్న సామెత ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు కచ్చితంగా వర్తిస్తుంది. జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో ప్రచారం దగ్గర నుంచి ఓటరును సంతృప్తి పరచడం వరకు కోట్ల రూపాయలు గుమ్మరించారు. నియోజకవర్గానికి కనీసం ఆయా పార్టీల అభ్యర్థులు రమారమి రూ.50 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.600 కోట్ల వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. ఇంత మేర ఖర్చు పెట్టినా దానికి తగిన ఫలితం ఉంటుందా అంటే.. పోటీలో నెగ్గేది ఎవరో ఒకరు కాబట్టి, ఓడిన వారి ఖర్చు గంగ పాలైనట్లే! ఇక గెలిచిన వారు పెట్టిన ఖర్చు ఎప్పటికి పూడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏదేమైనా ఎన్నికలు మరీ కాస్ట్లీగా మారాయన్నది మాత్రం వాస్తవం.

ఖర్చయిపోయారు..!

- జిల్లాలో భారీగా ఎన్నికల ఖర్చు
- డబ్బులు వెదజల్లిన అధికార పార్టీ
- ఓటుకు రెండు వేలకు పైగానే పంపిణీ

● ఎన్నికల సమయం మరీ ఎక్కువ కావడంతో..

సాధారణంగా ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్, ఎన్నికలకు పెద్ద సమయం ఉండదు. కానీ ఈసారి ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న విడుదలైతే, నోటిఫికేషన్ ఏప్రిల్ 18న, ఎన్నికలు మే 13న జరిగాయి. ఈ లెక్కన ఎన్నికల హడావుడి దాదాపు రెండు నెలలు సాగింది. ఇక ప్రధాన పార్టీలైన వైసీపీ, టీడీపీలకు సంబంధించి అభ్యర్థులు దాదాపుగా ముందే ఖరారు అయిపోయారు. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల రణరంగానికి సిద్ధమైపోయారు. ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా ఉన్నా.. ఖర్చు కోసం వెనుకడుగు వేసే పరిస్థితి లేకపోయింది. కానీ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.75 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. కానీ ఈ లెక్కల ప్రకారం ఆయా పార్టీల అభ్యర్థులకు ఒక్క రోజు కూడా సరిపోదు. ఈ 60 రోజుల్లో ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి దాదాపు రూ.7 నుంచి రూ. 10 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. పోలింగ్‌కు ఒకటి రెండు రోజుల ముందు ఓటర్లకు పంచి పెట్టే డబ్బులు దీనికి అదనం.

● ప్రచార కూలీలకు..

ప్రస్తుత పరిస్థితుల్లో నాయకుడి ముఖం చూసి సభలకు గానీ, ర్యాలీలకు గానీ వచ్చే పరిస్థితి లేదు. కూలీ లెక్క ముట్టజెబితేనే ఎవరైనా ప్రచారానికి వచ్చే పరిస్థితి ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా ఆయా పార్టీల ముఖ్య నాయకుల సభల సమయంలో డబ్బులు, మద్యం పంపిణీ చేసి జనాన్ని తరలించే వార్తలు చూస్తూనే ఉంటాం. ప్రస్తుత ఎన్నికల సభలు, ర్యాలీలు ఇందుకు భిన్నమేమీ కాదు. మహిళలను తరలించాలంటే రోజుకు రూ.200 నుంచి రూ.300 వందలు, పురుషులైతే కూలీతోపాటు మద్యం, బిర్యాని పొట్లాలు తప్పనిసరి. ఇలా కాకుండా ఏ నాయకుడైనా డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టాడా? తెల్లారి నుంచి ప్రచారానికి వచ్చేందుకు జనం సుముఖత చూపరు. ఇక ప్రచారం సమయంలో వచ్చిన వారికి అల్పాహారం, భోజనం ఖర్చులు చూసుకోవాల్సిందే! ఇందుకు ఉదాహరణ. ఈ రెండు నెలలు జిల్లాలోని ఆయా హోటళ్లు ఫుల్లు గిరాకీతో నడవడమే! ఈ సేవలన్నీ అభ్యర్థుల అనుచరులు చూసుకోవాల్సిందే! లేకుంటే ప్రచార హడావుడి అటకెక్కి జనంలో పలుచనైపోయే అవకాశం ఉంది. ఇది తమ పుట్టి ఎక్కడ ముంచుతోందనన్న భయం కూడా ఉంటుంది. అన్ని బాగుండి గెలిచిన తర్వాత పెట్టిన లెక్కంతా రాబట్టుకోవచ్చన్నది ఆయా నాయకుల ఆలోచన. నాయకులు ఎంత ఖర్చయినా సరే పెట్టాల్సిన పరిస్థితి.




● చివరి రెండ్రోజులు..

అన్ని రోజులు ఒక ఎత్తయితే ఎన్నికల చివరి రెండ్రోజులు ఖర్చు ఒక ఎత్తు. ప్రత్యర్థికి దీటుగా డబ్బులు పంచగలిగితేనే ఎన్నికల్లో విజయమనే భావన అందరిలో పెరిగిపోయింది. అసలు పార్టీలు ఇలా ఖర్చు పెట్టగలిగే అభ్యర్థికే టికెట్ ఇవ్వడం పరిపాటిగా మారిపోయింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా అన్ని పార్టీలు ఇదే ఫార్ములాను పాటించాయి. ముఖ్యంగా అధికార పార్టీ ఓటుకు రూ.2 వేలు పంచాలంటూ ముందుగానే సూచించనట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ నాయకులు నియోజకవర్గంలోని దాదాపు 80 శాతం ఓటర్లకు ఓటు డబ్బులు పంపిణీ చేశారు. ఈ లెక్కన ఒక్కో నియోజకవర్గానికి దాదాపు రూ.40 కోట్ల అంచనా లెక్క వస్తోంది. ఈ లెక్కన వైసీపీ, టీడీపీల తరఫున అయిన ఖర్చు ఒక్కో నియోజకవర్గానికి దాదాపు రూ.80 నుంచి రూ.100 కోట్లు అయినట్లు తెలుస్తోంది.



● పెట్రోలు, డీజిల్‌కే రూ. కోటి

ఒకప్పుడు ఓటింగ్ తీరు వేరే విధంగా ఉండేది. ఏదైనా ఊరిలో మీటింగ్ పెట్టి, పాదయాత్రలు చేసి తమ వర్గం వారికి ఓ మాట చెబితే దానికి కట్టుబడి ఓట్లు వేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితి మారిపోయింది. నేటి ఎన్నికల ప్రచార సరళే మారిపోయింది. నామినేషన్ వేయాలన్నా, ప్రచారానికి పోవాలన్నా ఆయా నాయకులు భారీ ర్యాలీ పరిపాటిగా మారిపోయింది. ఇందులో వాహనాలదే కీలకపాత్ర. కార్లు, బైక్‌లు ఎన్ని ఎక్కువగా ఉంటే.. అంత పెద్ద నాయకుడు అన్న పరిస్థితికి చేరుకుంది. దీనికి తోడు ఆయా నాయకుడు వెంట కాన్వాయ్‌ల వాహనాల వరుస ఉండాల్సిందే! నియోజకవర్గాల్లోని అనుచరగణానికి కూడా అభ్యర్థులు కార్లు పంపాల్సిన పరిస్థితి. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల నేపథ్యంలో ఒక్కో వాహనానికి రూ.2500, డ్రైవర్ భత్యం వంటి ఖర్చులు నాయకులే పెట్టుకోవాల్సి వస్తోంది. ఇలా రోజుకు ఒక్కో అభ్యర్థికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ఖర్చు అవుతోందని అంచనా! ఈ లెక్కన ఈ రెండు నెలలు పెట్రోలు, డీజిల్‌కే కోట్ల రూపాయలు ఖర్చు అయినట్లు తెలుస్తోంది.



● అధికారుల ఆరా..

నాయకులు ఈ తీరున ఖర్చు చేస్తున్నారని అధికారులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ టీములతో పాటు మిగతా అధికారులు రోజూ అభ్యర్థుల లెక్కలను నమోదు చేస్తూ వచ్చారు. నామినేషన్ల ముందు వరకు ప్రచార ఖర్చులను పార్టీల లెక్కల్లోకి చేర్చారు. అభ్యర్థి పోటీలో ఖరారయిన తర్వాత ఖర్చులను అభ్యర్థుల లెక్కల్లోకి చేర్చారు. ఇంతే ఖర్చు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా.. అభ్యర్థులు విపరీతంగా ఖర్చు పెట్టారన్నది బహిరంగ రహస్యమే! అభ్యర్థులు పెట్టిన ఖర్చులకు, అధికారులు రాసుకున్న లెక్కలకు పొంతన కుదరాల్సిందే! ఎన్నికలు పూర్తయని 45 రోజుల్లో అభ్యర్థులు తమ ఖర్చులను ఎన్నికల అధికారులకు సమర్పించాలి. అధికారుల నిర్ణయించిన దానికంటే అభ్యర్థుల ఖర్చులు ఎక్కువ ఉంటే వాటిపైన నిర్ణయం తీసుకునే అధికారం ఎన్నికల అధికారులకు ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు విపరీతంగా ఖర్చు పెట్టినా నామమాత్రపు ఖర్చునే అధికారులకు సమర్పిస్తారన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే! ఏదేమైనా ఎన్నికల్లో డబ్బు ప్రవాహం అపుతామని ఎన్నికల కమిషన్ చెప్పిన మాటలు వట్టి డొల్లేనని ఆయా పార్టీల అభ్యర్థుల ఖర్చును, ఓటర్లకు పంచిన డబ్బును చూస్తే సులభంగా అర్థమవుతోంది.

భగ్గుమంటున్న ధరలు

- బీర, చిక్కుడు కేజీ రూ.160, మిర్చి రూ.120
- కొనలేకపోతున్న సామాన్యులు



చాగలమర్రి సంతమార్కెట్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

చాగలమర్రి, మే 15: కూరగాయల రేట్లు భగ్గుమంటున్నాయి. సామాన్యులు కొనలేనంతగా ధరలు పెరిగాయి. దీంతో కేజీ కొనేవాళ్ల అరకేజీ.. అరకేజీ కొనే జనాలు పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. చాగలమర్రి మార్కెట్‌లో బుధవారం కేజీ మిర్చి రూ.120 పలికింది. కాకర కాయలు కేజీ రూ.120, చిక్కుడు కాయలు కేజీ 160, బీరకాయలు కేజీ రూ.160, క్యారెట్ రూ.80, బీన్స్ కేజీ రూ.160, వంకాయలు కేజీ రూ.60 పలికాయి అల్లం కేజీ రూ.200 ధర పలికింది. ఏ కూరగాయ చూసినా కేజీ రూ.80 నుంచి రూ.100 పలుకుతుండటంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చొరవ తీసుకొని కూరగాయల ధరలను అదుపు చేసి ఆదుకోవాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు.

ఫలితాలపై పందేలు

- ఎన్నికల్లో గెలుపునకు ఓ లెక్క.. మెజార్టీపై మరో లెక్క
- నేతల నుంచి కార్యకర్తల దాకా బెట్టింగ్‌ల జోరు
- రూ. కోట్లలో నడుస్తున్న పందేలు



కొలిమిగుండ్ల రూరల్, మే 15: కాయ్ .. రాజా కాయ్ .. ఒకటికి రెండు .. ఒకటికి మూడు .. ఒకటికి ఐదు .. ఎన్నికల ఫలితాలపై జోరుగా సాగుతున్న పందేల పర్వం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎంతో ప్రాధాన్యత కలిగిన బనగానపల్లె నియోజకవర్గం గెలుపోటములపై ఇప్పుడు పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఎన్నికల పర్వం ముగిసి ఫలితాలకు జూన్-4వరకు వేచి వుండాల్సి రావడంతో పార్టీల, అభ్యర్థుల జయాపజయాలపై బెట్టింగ్‌ల పర్వం సాగుతోంది. ఏ పార్టీ గెలుస్తుంది? ఎంత మెజారిటీ వస్తుందనే విషయంలో బనగానపల్లె నియోజకవర్గంలోనే కాదు ఉమ్మడి కర్నూల్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పందేలు కొనసాగుతున్నాయి. బనగానపల్లెలో కాటసాని, బీసీ గెలుపుపై పందెం కాస్త తక్కువ మొత్తంలోనే నడుస్తున్నా, బీసీ మెజారిటీపై పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా వైసీపీకి కంచుకోట లాంటి కొలిమిగుండ్ల మండలంలో టీడీపీ మెజారిటీ వస్తుందని ఓ వర్గం, కాదు వైసీపీకే మెజార్టీ వస్తుందని మరో వర్గం బెట్టింగ్‌లు కాస్తున్నాయి. ఇందులో రూ. లక్షకు రెండు రూ. లక్షలు, లక్షకు మూడు లక్షలు, ఐదు లక్షల వరకు బెట్టింగ్‌లు సాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. పెద్ద స్థాయి నేతల నుండి, నాయకులు, కింది స్థాయి కార్యకర్తల వరకు వారి వారి స్థాయిని బట్టి పందెం వేస్తున్నారు. మరోవైపు బనగానపల్లె నియోజకవర్గం గెలుపు, మెజారిటీలపై ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమలోని అనేక ప్రాంతాల్లో బెట్టింగ్ నడుస్తుండడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వాల ఏర్పాటుపై కూడా పెద్ద మొత్తంలో పందెం కొన సాగుతున్నట్లు తెలుస్తోంది.

కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

అధికారులకు సూచనలు చేసిన కలెక్టర్



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (కల్చరల్), మే 15: కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. అనంతరం సాంకేతిక నిపుణులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మూడెంచల భద్రత నడుమ ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ నిమిత్తం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సీసీ టీవీల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చూసుకునేలా పార్టీయేషన్ చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైన ఇన్వర్టర్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాలేజీలో ఉన్న లైబ్రరీ హాలులో మీడియా రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. కలెక్టర్ వెట జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, నంద్యాల తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



డోన్‌లో టీడీపీ నేతను అరెస్టు చేసిన పోలీసులు

డోన్, మే 8: టీడీపీ నేత సీమ సుధాకర్ అరెస్టుతో డోన్‌లో హైటెన్షన్ నెలకొంది. బుధవారం తెల్లవారు జామున టీడీపీ నేత సీమ సుధాకర్‌రెడ్డిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేయడంతో డోన్ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి వైసీపీని వీడి ఎన్నికల సమయంలో టీడీపీలో చేరారు. డోన్‌లో వీఆర్వోగా పని చేస్తున్న మల్లారెడ్డి సోదరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా వీరు ప్రచారం నిర్వహించారు. దీంతో మంత్రి బుగ్గన సీమ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో మల్లారెడ్డిని టార్గెట్ చేశారు. గార్లదిన్నె గ్రామంలో ఫిబ్రవరి 12న జరిగిన దాడి కేసులో సీమ సుధాకర్‌రెడ్డితోపాటు మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పని చేశారని మంత్రి బుగ్గన ఆ కేసును తెరపైకి తెచ్చారు. టీడీపీ నేతలను అరెస్టు చేసేవిధంగా పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ మేరకు పోలీసు బలగాలతో పట్టణంలోని టీడీపీ నేత సీమ సుధాకర్‌రెడ్డి ఇంటికి తెల్లవారు జామున 3గంటలకు చేరుకున్నారు. సుధాకర్‌రెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులు తడుతూ భయభ్రాంతులకు గురి చేశారు. అనంతరం సీమ సుధాకర్‌రెడ్డి, ఆయన తనయుడు రామసుబ్బారెడ్డిని అరెస్టు చేశారు. అలాగే వీఆర్వో మల్లారెడ్డితోపాటు ఏకాంతరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలను కూడా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని బనగానపల్లె పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత బేతంచెర్ల స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కోట్ల ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం స్పందించారు. డీఎస్పీతోపాటు పోలీసులు మంత్రి బుగ్గన చెప్పినట్లు పని చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున పట్టణంలోని కోట్ల నివాసానికి చేరుకున్నాయి. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బలగాలతో కోట్ల నివాసానికి వచ్చారు. దీంతో పోలీసులు మోహరించడంపై పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కోట్ల దంపతులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ధర్నాకు అనుమతి లేదని అర్థం చేసుకోవాలని వారిని కోరారు. అరెస్టు చేసిన వారిని డోన్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.



కోట్ల ప్రకాష్‌రెడ్డి, సుజాతమ్మలతో మాట్లాడుతున్న సీఐ

డోన్‌లో హైటెన్షన్

- టీడీపీ నేత సీమ సుధాకర్ అరెస్టు
- బనగానపల్లెకు తరలింపు
- టార్గెట్ చేసిన మంత్రి బుగ్గన



కోట్ల నివాసానికి తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు

పెట్నికోట ఘటనలో పోలీసుల పక్షపాతం

మొత్తం 29మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసుల వెల్లడి

బనగానపల్లె/ కొలిమిగుండ్ల రూరల్, మే 15: కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామంలో సోమవారం పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనలో పోలీసులు ఏక పక్షంగా కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. గొడవకు సంబంధించిన కారణాలు పరిగణలోకి తీసుకోకుండా వైసీపీ నేతల వత్తిడితో పలువురు టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది. గొడవను నివారించడానికి ప్రయత్నించిన టీడీపీ సీనియర్ నేత బివి పక్కీర్‌రెడ్డితో పాటు, జిల్లా జనరల్ ఏజెంట్‌గా పరిశీలనకు వచ్చిన మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు గొంగటి హుస్సేన్‌రెడ్డితో పాటు మొత్తం 29మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఇరువర్గాలు గొడవకు పాల్పడితే ఒక పార్టీ వారిపైనే కేసులు నమోదు చేయడం పోలీసుల తీరును తెలియజేస్తోందని పలువురు అంటున్నారు. మరోవైపు సామూహిక గొడవలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం చూస్తే కావాలనే వైసీపీ అధి నాయకుల వత్తిడితోనే ఈ కేసు నమోదు చేసినట్లు అర్థమవుతోంది.

కొనసాగుతున్న వైశాఖ బ్రహ్మోత్సవాలు

ఆళ్లగడ్డ, మే 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వేకువ జామునే ఉత్సవమూర్తి జ్వాలా నరసింహస్వామిని విశేషంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకించారు. స్వామి వారిని గరుడ విమానంపై మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



గరుడ విమానంపై ఊరేగుతున్న స్వామి వారు



పర్యాటక ప్రభ..
బనగానపల్లె

● చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రం ● ఆనందం, ఆహ్లాదం పంచే ప్రాంతాలు

బనగానపల్లె, మే 15

బనగానపల్లె నియోజకవర్గ పరిధిలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. దీని వల్ల బనగానపల్లె పర్యాటక హబ్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని యాగంటి క్షేత్రం పర్యాటకంగానే కాక భక్తి క్షేత్రంగా వర్ధిల్లుతోంది. గతంలో వారంలో సోమవారం, కార్తీక మాసం, శివరాత్రి పర్వదినాల్లో మాత్రమే భక్తులు ఎక్కువగా వచ్చేవారు. రాష్ట్ర విభజన తర్వాత భక్తుల రద్దీ పెరిగింది. వివిధ జిల్లాల నుంచి వాహనాల్లో భక్తులు నిత్యం వందలాదిగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు కొలిమిగుండ్ల మండలంలో ఉన్నాయి. నిత్యం వందలాది మంది బెలుం గుహలను సందర్శిస్తుంటారు. బెలుం గుహలు ఆసియాలోనే అతి పెద్దవి. ప్రపంచంలో ద్వితీయ స్థానంలో నిలిచాయి. అలాగే అవుకు రిజర్వాయరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే సన్నాహాలు జరుగుతున్నాయి. అక్కడ బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మండలంలోని మరో ముఖ్యమైన ప్రాంతం నందవరం చౌడేశ్వరీమాత ఆలయం. నిత్యం వేలాదిగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తుంటారు. అలాగే యాగంటి సమీపంలోని పాతపాడు గ్రామం వద్ద నవాబుల కాలంనాఇ బంగ్లాను చూడడానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు.

యాగంటి :



బనగానపల్లె నుంచి యాగంటి క్షేత్రం 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. కర్నూలు నుంచి 87 కిలోమీటర్ల దూరంలో ఉంది. బనగానపల్లె నుంచి యాగంటి వరకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. ఆటోల్లో వెళ్లవచ్చు. అలాగే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. గతంలో పాతపాడు నుంచి యాగంటికి సింగిల్ రోడ్డు ఉండేది. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించి డబుల్ రోడ్డుగా మార్చారు. యాగంటిలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో గదులు ఉన్నాయి. అలాగే బ్రాహ్మణి రెసిడెన్సీలో ఏసీ గదుల సౌకర్యం ఉంది. రూ.కోటి వ్యయంతో కొండలను తొలిచి యాత్రికులు కూర్చోవడానికి, సేదతీరేందుకు దేవదాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. వృద్ధులు, ఆలయంలోకి వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

బెలుం గుహలు :




కొలిమిగుండ్ల మండలంలో ఉన్న బెలుం గుహల అభివృద్ధికి టూరిజంశాఖ ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం గుహల్లో 27 బ్లోయర్లను ఏర్పాటు చేశారు. 2000లో బెలుం గుహలను అభివృద్ధికి చేసి ప్రారంభించారు. బనగానపల్లె నుంచి గుహలకు ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది. రోజూ వివిధ రాష్ట్రాల నుంచి 2వేల మంది యాత్రికులు వీటిని సందర్శిస్తుంటారు. సెలవు రోజుల్లో అధికంగా వస్తుంటారు. ఏటా సుమారు 2లక్షల మంది యాత్రికులు గుహల్లో ప్రకృతి సిద్ధమైన శిలాజాలను చూడడానికి వస్తుంటారు. విదేశీయులు కూడా వస్తుంటారు. గుహల్లో ధ్యాన మందిరం, ఊడలమర్రి, పాతాళగంగ, మాయమందిరం, కోటిలింగాలు యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తుంటాయి. ఇక్కడ బుద్ధ విగ్రహం ఉంది. అయితే బెలుం గుహల్లో నాలుగు డార్మెట్రీ గదులు మాత్రమే ఉన్నాయి. అయితే గుహల్లో పర్యాటకులకు సరైన సౌకర్యాలు లేవు. గుహల్లో బ్లోయర్లు సరిగా పనిచేయడం లేదు. గుహల్లో తాగునీటి వసతి లేదు.

బోటింగ్ సౌకర్యం నిలుపుదల



అవుకు పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో అవుకు రిజర్వాయరు వద్ద ఏర్పాటు చేసిన బోటింగ్ సౌక్యర్యం నిలిపివేశారు. గత రెండు సంవత్సరాల క్రితం రిజర్వాయర్‌లో బోటు బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. దీంతో బోటింగ్ సౌకర్యాన్ని నిలిపివేశారు. రూ.2కోట్లతో టూరిజం శాఖ బోటింగ్ ఏర్పాటు చేసింది. యాత్రికులు సేదతీరడానికి విడిది కూడా నిర్మించారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కును ఏర్పాటు చేశారు. గతంలో స్పీడ్‌బోట్లు, మరబోట్ల సౌకర్యం ఉండేది. ప్రస్తుతం ఇవన్నీ నిలిపివేశారు.

నవాబు బంగ్లా



బనగానపల్లె పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో పాతపాడు గ్రామం వద్ద నవాబు బంగ్లా ఉంది. వంద సంవత్సరాల క్రితం దీన్ని నిర్మించారు. ఇప్పటికీ ఈ కట్టడం చెక్కుచెదరలేదు. ఈ బంగ్లా వద్దనే అరుంధతి సినిమాను తీశారు. అందుకే దీన్ని అరుంధతి బంగ్లా అని అంటారు. యాగంటికి వచ్చే యాత్రికులు తప్పనిసరిగా నవాబు బంగ్లాను సందర్శిస్తుంటారు.

చౌడేశ్వరీ మాత ఆలయం :



మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయం. యాత్రా స్థలంగానే కాక ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోంది. ఇక్కడ చౌడేశ్వరీ మాత ఆలయం ప్రసిద్ధిగాంచింది. జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వాహనాల్లో వస్తుంటారు. బనగానపల్లెకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. 20 నిమిషాలకోసారి బస్సు సౌకర్యం ఉంది.

బీఈడీ, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు

కర్నూలు(అర్బన్), మే 15: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో డిగ్రీకి 61, బీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ సెమిస్టర్ పరీక్షలకు 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులందరూ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షలు, బీఈడీ 1,3,4 సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

అభ్యర్థుల గెలుపు కోసం అందరూ పని చేశారు
కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కే బాబు రావు

కర్నూలు(అర్బన్), మే 15: సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు పని చేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబు రావు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు ముందస్తు ప్రణాళికలతో జిల్లాలో ప్రచారం నిర్వహించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో గురువారం పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌కు సర్వం సిద్ధం

కర్నూలు (ఎడ్యుకేషన్), మే 15 : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీ ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్ 2024కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 16 ,17 తేదీలలో అగ్రికల్చర్, బీ ఫార్మసీ, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరగనున్నాయి. కర్నూలు నగరంలో 6, ఎమ్మిగనూరులో 1 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష లకు 18,309 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందే విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రామాంజనేయులు(ఫైల్)

కోసిగి, మే 15: మండలంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన యువ రైతు సద్దాల రామాంజనేయులు(28) తన వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతంతో బుధవారం మృత్యువాత పడ్డాడు. బోరుకు బిగించిన విద్యుత్ వైర్లు ఎర్త్ కావడం గమనించకుండా మోటారును ఆన్ చేయడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే కింద పడి పోయాడు. తోటి రైతులు, తండ్రి బూదురెడ్డి వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ మనోజ్ కుమార్ పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతునికి భార్య నాగవేణి ముగ్గురు కుమారులు సంతానం ఉన్నారు. నాగవేణి ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. రామాంజనేయుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం రైతుకుటుంబానికి నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చింత చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గోవిందు

మహానంది, మే 15: చింత చెట్టుపై నుంచి పడి బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలం కేంద్రంలోని పార్వతీపురం కాలనీకి చెందిన గోవిందు(52) మహానంది దేవస్థానంలో ఏజన్సీ ప్రతిపాదికన విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆలయం సమీపంలోని చింత ఎక్కి చిగురు కోసుకుంటుండగా కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో తోటి ఉద్యోగులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహానంది పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఎనిమిది మందిపై కేసు నమోదు

పగిడ్యాల, మే 15: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. ఈ ఘటనలో వైసీపీ కార్యకర్త విజేయుడుకు గాయపడటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తెలుగు వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, గంగి రమణ, హరి, శేఖర్, కాశీ, కర్ల, నగేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలి
- ఈవో పెద్దిరాజు



మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మే 15: శ్రీశైలం దేవస్థానంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్థానిక సత్ర సముదాయాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆలయ కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆలయ అధికారులు, సత్రం నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై సత్రాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. ప్రతి సత్రం వద్ద రెండు చెత్తకుండీలను ఏర్పాటు చేసి పొడి చెత్త, తడిచెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. దేవస్థానం పరిధిలో ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించామని, వాటికి ప్రత్యామ్నాయంగా మట్టి, కాగితం గ్లాసులు, రాగి సీసాలు, గాజు సీసాలు, కాగితం, జూట్ బ్యాగులు విస్తరాకులు వినియోగించాల అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణ, సహాయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు, భద్రతా విభాగపు పర్యవేక్షకులు అయ్యన్న, రెవెన్యూ విభాగపు పర్యవేక్షకుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తు.. రైతు చిత్తు!

- పల్లెలకు చేరుతున్న బీటీ-2 పత్తి నకిలీ విత్తనాలు
- కర్ణాటక, తెలంగాణలో ప్యాకింగ్
- అధికారులు అప్రమత్తం కావాల్సిన సమయం ఇదే
- నిఘా కళ్ల మూసుకుంటే కష్టజీవులకు ఉరితాళ్లే



వెల్దుర్తి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న బీజీ-2 పత్తి నకిలీ విత్తనాలు (ఫైల్)

కర్నూలు, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ గ్రామాలకు అప్పుడే బీటీ-2 పత్తి నకిలీ విత్తనాలు తరలిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి రైతులకు అంటగట్టేందుకు అక్రమార్కులు సిద్ధమవుతున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్యాకింగ్ చేసి.. ఉమ్మడి జిల్లాలో ఆదోని, కర్నూలు, నంద్యాల కేంద్రంగా వివిధ ప్రాంతాలకు చేర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు విశ్వాసనీయ సమాచారం. ముందుగా జిల్లా వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా అధికారులు నకిలీ విత్తన సరఫరాకు అడ్డుకట్ట వేయకపోతే.. తక్కువ ధరకు వస్తాయని నకిలీ, నాసిరకం విత్తనాలను నమ్ముకొని రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలే శరణ్యమని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గతేడాది 2023-24 ఖరీఫ్‌లో 3.15 లక్షల హెక్టార్లు (7.87 లక్షల ఎకరాలు)లో బీటీ-2 పత్తి సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది రుతుపవనాలు ఆశాజనకంగా ఉండడంతో పత్తిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పొలాలు దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సన్నద్ధం చేస్తున్నారు. 2024-25 ఖరీఫ్‌లో 3.15-.3-25 లక్షల హెక్టార్లలో సాగు చేయవచ్చని అనధికారిక అంచనా. రైతులు ఎకరాకు మూడు ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్ 450 గ్రాములు) విత్తనాలు పొలంలో నాటుతున్నారు. ఈ లెక్కన సుమారు 23.62 లక్షల బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా. ఆ స్థాయిలో అనుమతి పొందిన విత్తన కంపెనీలు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడం లేదని, గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి విత్తన ఉత్పత్తి కూడా బాగా తగ్గిందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. ఇదే అదనుగా భావించిన నకిలీ విత్తన మాఫియా రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నకిలీ విత్తన వ్యాపారులు పల్లెల్లో వాలిపోయి మట్టిమనుషులను దగా చేస్తున్నారు. తక్కువ రేటుకు వస్తాయని వాటిని కొనుగోలు చేసి సరైన దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

● అడ్డుకోవాలి:



ఆదోని మండలం పెసలబండ, బైచిగేరి, బస్పాపురం, పెద్దహరివాణం, సంతేకూడ్లూరు, ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల, ఎమ్మిగనూరు టౌన్, కోసిగి మండలం దుద్ది, పల్లెపాడు, కోల్‌మాన్‌పేట, కందుకూరు, కోసిగి, సాతనూరు, వందగల్లు, ఆస్పరి మండలం కారుమంచి, కోడుమూరు మండలం అమడగుంట్ల, వెంకటరిగి, అల్లినగర్, గోనెగండ్ల మండలం అగ్రహారం, గంజెహల్లి గ్రామాలు నాసిరకం విత్తనాలకు అడ్డాగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఐజ, గద్వాలకు చెందిన విత్తన వ్యాపారులు కొందరు జిల్లాలో అక్రమార్కులతో కుమ్మక్కై నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తున్నారు. అలాగే.. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప ప్రాంతంలో ప్యాకింగ్ చేసిన బీటీ-2 పత్తి విత్తనాలను జిల్లాలో వివిధ ప్రాంతాలకు చేరవేస్తుండగా గత ఏడాది, అంతకుముందు ఏడాది నిఘా అధికారులు పట్టుకొని రూ.లక్షల విలువైన విత్తనాలు సీజ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప, రాయచూరు, సింధనూరు ప్రాంతాల నుంచి కూడా జిల్లాకు భారీగా నకిలీ విత్తనాలు వస్తున్నాయి. నంద్యాల పట్టణం నూనేపల్లి కేంద్రంగా భారీ ఎత్తున పత్తి నకిలీ విత్తనాలు ప్యాకింగ్, సరఫరాను గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుట్టు రట్టు చేశారు. అలాగే.. కర్నూలు నగరం కల్లూరు ఎస్టేట్ ప్రాంతంలో కూడా రూ.లక్షల విలువైన నకిలీ విత్తనాలు సీజ్ చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెంచి ఇతర రాష్ట్రాల నుంచి సరిహద్దులు దాటి జిల్లాకు నకిలీ విత్తనాలు రాకుండా అడ్డుకట్ట వేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు జగన్నాథం డిమాండ్ చేశారు.

మహానందిలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్



మహానందిలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకటరమణ

మహానంది, మే 15: మహానంది క్షేత్రంలో బుధవారం సాయంత్రం రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పి. వెంకటరమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా మహానందికి చేరుకొన్న వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందచేశారు. వీరి వెంట నంద్యాల అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి ఉన్నారు.

'వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈవో

మహానంది, మే 15: ఎండకు ఉపాధి పనులు చేసే కూలీలు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి సూచించారు. మండలంలోని అబ్బీపురం సమీపంలో చేస్తున్న ఉపాధిపనుల కూలీలకు ఎండాకాలంలో ఉపాధి కూలీలు ఆరోగ్య పరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

పాలేరు వాగుపై పొంచి ఉన్న ప్రమాదం



పాలేరు వాగు రహదారిపై అడ్డంగా విరిగి పడిన చెట్టు (ఫైల్)

మహానంది, మే 15: మహానంది- గాజులపల్లి ప్రధాన రహదారిలోని పాలేరువాగు ప్రధాన రహదారిపై ఈనెల 7 వతేదిన వీచిన ఈదురుగాలులకు భారీ చెట్టు నేలకూలింది. వృక్షం లోని కొంత భాగం పాలేరువాగులోని ప్రధాన రహదారిపై పడింది. ఇంత వరకు ఆర్ అండ్ బీ శాఖ అధికారులు చెట్టును తొలగించక పోవడంతో ఎదురుగా వచ్చే వాభనాలు కనిపించక ప్రమాదం జరగవచ్చని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోనే మహానంది క్షేత్రానికి దర్శనం కోసం ప్రతి రోజు వందలాది భక్తుల వాహనాలు వస్తుంటాయి. దీంతో పాటు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల, గాజులపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ఈ రహదారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికైన ఆర్ అండ్ బీ శాఖ అధికారులు పాలేరు వాగుపై పడిన చెట్టును తొలగించి ప్రమాదం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరారు.

మా పరిస్థితి ఏంటి?

- కొత్త ప్రభుత్వంలో అవకాశం వస్తుందా..
- సంకటంలో వలంటీర్లు



నందికొట్కూరు, మే 15: వైసీపీ ప్రభుత్వంలో అన్నీ తామై వ్యవహరించిన వలంటీర్లు ఎన్నికల సమయంలో వందల సంఖ్యలో విధుల నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటంతో ఎంతో మంది యువకులు రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన తరువాత వలంటీర్లుగా చేరారు. నెలకు రూ.5 వేల పారితోషికంతో వారు పని చేశారు. నియోజకవర్గంలోని నందికొట్కూరు పట్టణం, నందికొట్కూరు మండలం, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, పాములపాడు, మిడ్తూరు, పగిడ్యాల మండలాల్లో 73 సచివాలయాలు ఉన్నాయి. అందులో 1371 మంది వలంటీర్లు పోస్టులు ఉండగా 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 1363 మంది పని చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 701 మంది వలటీర్లు రాజీనామాలు చేయగా, 662 మంది ప్రస్తుతం విధుల్లో ఉండగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరిని ప్రభుత్వం పక్కన బెట్టింది. ఒక్కో వలంటీరు పరిధిలో 50 ఇళ్లను కేటాయించి, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడం, రేషన్ పంపిణీ వంటి విధులను వలంటీర్లకే కేటాయించారు. ప్రజలతో మమేకమైన వలంటీర్లను ఎన్నికల్లో వినియోగించుకోవడానికి వీలుగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర వంటి పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాల ఫిర్యాదులో ఎన్నికల కమిషన్, వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచింది. అయితే వలంటీర్ల సేవలను ఎలాగైనా ఉపయోగించుకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న వైసీపీ నాయకులు వారితో రాజీనామా చేయించింది. కొందరు అయిష్టత వ్యక్తం చేసినా వారిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి మరీ రాజీనామా చేయించినట్లు సమాచారం. టీడీపీ అధినేత చంద్రబాబు వంటీర్లకు తాము వ్యతిరేకం కాదని, తమ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రూ.10 వేల పారితోషికం ఇచ్చి పనులు చేయిస్తామని ప్రచారాల్లో హామీ ఇచ్చారు. దీంతో వలంటీర్లుగా పని చేసి విధుల నుంచి తప్పుకున్న వారు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైతే తమను తిరిగి విధుల్లోకి తీసుకుంటారనే ఆశతో ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లో తీసుకుంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక వేళ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాయకులు చెప్పినా కూడా రాజీనామా చేయని వారిని విధుల్లో కొనసాగిస్తారా? లేక వారి స్థానంలో కొత్త వారిని వైసీపీ ప్రభుత్వం తీసుకుంటుందా అన్న సందిగ్ధత వారిలో నెలకొంది. ఏదేమైనా ఏ ప్రభుత్వం వచ్చినా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది వలంటీర్లలో ప్రశ్నార్థకంగా మారింది.

మండలాల వారీగా సచివాలయాలు

- నందికొట్కూరు పట్టణంలో 14 సచివాలయాల్లో 254 వలంటీర్లు, ఉండగా 108 రాజీనామా చేయగా 144 మంది విధుల్లో ఉన్నారు.
- పగిడ్యాల 10 సచివాలయాలు 172 వలంటీర్లు, 99 రాజీనామా చేయగా 73 మంది విధుల్లో ఉన్నారు.
- మిడ్తూరు 14 సచివాలయాలు 200 వలంటీర్లు, 6 ఖాళీలు, దీంతో 194 మంది ఉండగా అందులో 124 మంది రాజీనామా చేయగా 70 విధుల్లో ఉన్నారు.
- కొతపల్లి 11 సచివాలయాల్లో 160 వలంటీర్లు, 33 మంది రాజీనామా చేయగా 127 మంది విధుల్లో ఉన్నారు.
- నందికొట్కూరు రూరల్ 13 సచివాలయాలు 197 వలంటీర్లు, 123 మంది రాజీనామా చేయగా 74మంది విధుల్లో ఉన్నారు.
- పాములపాడు 13 సచివాలయాలు 204 వలంటీర్లు, 125 మంది రాజీనామా, 79 మంది విధుల్లో ఉన్నారు.
- జూపాడుబంగ్లా 11 సచివాలయాలు 184 వలంటీర్లు 89 మంది రాజీనామా చేయగా 95 మంది విధుల్లో ఉన్నారు.

వేసవి దుక్కుల్లో అన్నదాతల బిజీ

- తొలకరి వర్షాలు కురిస్తే పంట భూములకు ప్రయోజనం
- మండలంలో మొదలైన వేసవి దుక్కులు



పొలంలో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

ఆత్మకూరు, మే 15: తొలకరి వర్షాలకు రైతన్నలు ముందుగానే వేసవి దుక్కుల్లో నిమగ్నమయ్యారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాకపోవడంతో రైతులు వచ్చే ఖరీఫ్ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దీంతో తమ పంట భూములను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని కరివేన, నల్లకాల్వ, బాపనంతాపురం, ముష్టేపల్లి, సిద్దేపల్లి, వెంకటాపురం, సిద్దాపురం, కృష్ణాపురం, అమలాపురం, శ్రీపతిరావుపేట, వడ్లరామాపురం, కురుకుంద, ఇందిరేశ్వరం తదితర గ్రామాలలోని రైతులు ముందస్తుగానే వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు. ప్రత్యేకించి వేసవి దుక్కులను ప్రధానంగా నాగలితో నేలను వాలుకు అడ్డంగా దున్నుకోవాల్సి ఉంటుంది. తొలకరి వర్షాలకు ముందే కనీసం రెండు సార్లు భూమిని దున్నుకుంటే వేసవి దుక్కుల వల్ల పంట భూములకు మరెన్నో ప్రయోజనాలు చేకూరి సత్ఫలితాలను పొందవచ్చు. ఇప్పటికే వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు వేసవి దుక్కులను దున్నుకునేందుకు బిజీబిజీ అయ్యారు.

వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలు:

లోతు దుక్కుల వల్ల నేలలో వర్షపు నీరు ఇంకిపోయి అక్కడికక్కడే ఇంకిన నీరు సంరక్షించబడి భూగర్భ జలాలు పెంపొందడమే గాకుండా భూసారాన్ని కూడా కాపాడవచ్చు. వేసవిలో పగటి వేడిమి తాపానికి, రాత్రి చల్లదనానికి నేల గుల్లగా తయారవడంవల్ల నేల ఆకృతి వృద్ధి చెందుతుంది. వేసవిలో దున్నడంవల్ల నేల పొరల్లో వున్న క్రిములు, కీటకాలు కోశస్థ దశలో బహిర్గతం అవడం,కలుపు విత్తనాలు కూడా వేడిమికి నశిస్తాయి. దీనివల్ల పంట కాలంలో కలుపు మందులకు, క్రిమిసంహారక మందులకు వెచ్చించాల్సిన ఖర్చులు కూడా తగ్గుతాయి. వేసవిలో దుక్కులు చేసుకోవడంవల్ల జూన్‌లో తొలకరి వర్షాలకు పంట విత్తుకోవడం సులభతరమవుతుంది. వర్షాధార మెట్ట వ్యవసాయం రైతుల లాభాలు పొందడానికి వేసవిలో లో దుక్కులు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించి ఖరీఫ్ సాగుకు ప్రోత్సహిస్తున్నారు.

వేసవి దుక్కులతో పంట భూములకు ప్రయోజనం



రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆయా పంటపొలాల్లో వేసవి దుక్కులను దన్నుకోవడం వల్ల పంట భూములకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. భూమిలో తేమశాతం పెంచేందుకు అవకాశం ఉండటంతో చీడపీడల నివారణ, కలుపు మొక్కల నియంత్రణకు దోహదపడుతుంది. తొలకరి వర్షాలకు ముందే వేసవి దుక్కులు చేసుకోవడం వల్ల రైతులకు అన్ని విధాలా ప్రయోజనం ఉంటుంది.

\- విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు

22న లక్ష్మీనరసింహ స్వామి జయంతి



ఆత్మకూరు, మే 15: ఆత్మకూరు మండలంలోని అతిపురాతన నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఈనెల 22వ తేదీన స్వామివారి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఎస్వీ రమణ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నరసింహస్వామి జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రాతఃకాల సమయం నుంచి స్వామిఅమ్మవార్లకు పంచ సూక్తములతో, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు విశేష అలంకరణ జరపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా లక్ష్మీనరసింహ స్వామి అమ్మవార్ల కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈ వేడుకకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

19న గడెపు ఎద్దుల పందెం

మిడుతూరు, మే 15: మిడుతూరు గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా ఈ నెల 19న ఉదయం ఏడున్నర గంటలకు గడెపు ఎద్దుల పందెం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎద్ల యజమానులు రూ.200 ప్రవేశ రుసుము చెలించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి నాలుగు బహుమతులు రూ.15వేలు, రూ.10 వేలు, రూ.7500, రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో పూజలు



పూజలందుకున్న సాక్షి గణపతి, జ్వాలా వీరభద్ర స్వామి

శ్రీశైలం, మే 15: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్దజలాలతో అభిషేకాన్ని జరిపి మహా మంగళ హారతులను సమర్పించారు.

- శ్రీశైలం క్షేత్రంలో లోకకల్యాణంకోసం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్తరభాగంలో ఉన్నటువంటి జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. స్వామికి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్దజలాలతో అభిషేకం నిర్వహించారు.

అలరించిన భజన



భజన చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మే 15: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం గుంటూరుకు చెందిన అభయాంజనేయస్వామి భజన సంఘం బృందంతో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విఘ్నేశ్వరా శివుని కుమారా, అభిషేకం చేద్దాం రండి, శివనామమే, శ్రీశైలమల్లన్న శంభోహర, చాలదా ఈ జన్మ, శంభో శంకరా, శ్రీగిరి భ్రమరాంబికా మొదలైన పలు భక్తిగీతాలను అరుణకుమారి, శ్రీనివాసరెడ్డి, వెంకటరత్నం, లక్ష్మి, సాగర్, పద్మావతి, ధనలక్ష్మీ, కుమారి, శివలీల తదితరులు ఆలాపించారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకుడు రవి

శ్రీశైలం, మే 15: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన కె. జితిన్ జయస్వామి దంపతులు రూ. 1,00,558 విరాళంగా అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకుడు జి.రవికి అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

భక్తుడికి బంగారు ఉంగరం అప్పగింత



భక్తునికి బంగారు అప్పగిస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్

మహానంది, మే 15: మహానంది క్షేత్రానికి దర్శనం కోసం వచ్చిన కోనేరులో స్నానాలు చేస్తున్న సమయంలో బంగారు ఉంగరం పొరపాటున పడిపోయింది. బుధవారం హైదరాబాద్‌కు చెందిన గోపాల్ కుటుంబ సమేతంగా మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చారు. ముందుగా ఆలయం రెండవ ప్రాకారంలోని కోనేరులో పుణ్య స్నానాలు చేస్తుండగా పొరపాటున గోపాల్ చేతికి ఉన్న బంగారు ఉంగరం పడిపోయింది. ఈ విషయాన్ని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు కోటయ్య దృష్టికి తీసుకెళ్లాడు.వెంటనే ఆయన స్థానిక చెంచు వ్యక్తులతో కోనేరులో అన్వేషించారు. దొరికిన బంగారు ఉంగరంను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు చేతుల మీదుగా భక్తుడికి అప్పగించారు.

ఎవరికి అనుకూలం

- గత ఎన్నికల కంటే 1.72 లక్షల ఓట్లు అధికం
- ఓటు వేసిన వారిలో యువకులు, ఉద్యోగులే ఎక్కువ
- కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో పెరిగిన పోలింగ్
- ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందో..
- జోరుగా సాగుతున్న చర్చలు
- కూటమికి మొగ్గు ఉందంటున్న విశ్లేషకులు



ఓటు వేయడానికి క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

కర్నూలు, మే 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరం ముగిసింది. పోలింగ్ పూర్తయింది. ఓటర్లు తమ తీర్పు చెప్పేశారు. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనే విషయంపైనే సస్పెన్స్ నెలకొంది.. ఈ ఉత్కంఠకు తెర పడాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిదే..! పల్లె, పట్నాలు తేడా లేకుండా అంతటా ఒకటే చర్చ..! ప్రభుత్వం ఏర్పాటు చేసేది ఎవరు..? ఐదేళ్ల జగన్ పాలనకు ప్రజలు చమర గీతం పాడుతారా..!? జన రాజ్యం కోసం చంద్రబాబుకు పట్టం కడుతారా..!? వంటి అంశాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. జిల్లాలో 2019 ఎన్నికల్లో పోలైన ఓట్లతో పోలిస్తే.. ఈ ఎన్నికల్లో 1.72 లక్షల మంది అధికంగా ఓటు వేశారు. వీరిలో ముప్పాతిక శాతం కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు, ఉద్యోగులే ఉన్నారని అంచనా. వీరు కూటమి వైపు మొగ్గు చూపారని పలువురు పేర్కొంటున్నారు. ఎవరి అంచనాలు ఎలా ఉన్నా.. ఓటరు తీర్పు ఎవరికి అనుకూలమనేది తెలియాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే..!

జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానంతోపాటు కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం (13న) పోలింగ్ ముగిసింది. 20,54,563 మంది ఓటర్లు ఉంటే.. 15,70,007 మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఆ నిర్ణయం ఈవీఎం యంత్రాలలో నిక్షిప్తమైంది. రాయలసీమ యూనివర్సిటీలో పారా మిలటరీ మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రంగా ఉంచారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. నాటి నుంచి పార్టీ టికెట్ రేసులో అధినేతల మనసు గెలుచుకోవడానికి.. టికెట్ ఖరారు అయ్యాక ఓటర్ల ఆకట్టుకోవడానికి కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరిగారు. సోమవారం పోలింగ్ ముగియడంతో బరిలో తలపడిన అభ్యర్థులు, వారికి మద్దతుగా సై అన్న లీడర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు, కీలకమైన కార్యకర్తలు రిలాక్స్ అయ్యారు. బుధవారం పోలింగ్ కేంద్రాలు వారిగా వచ్చిన పోలింగ్ నమోదు వివరాలను ముందు పెట్టుకొని గెలుపుపై అంచనాలు వేస్తున్నారు. టీడీపీ కూటమి, వైసీపీ ఇరు పార్టీలు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా.. 2019 ఎన్నికల్లో పోలైన ఓట్లతో పోలిస్తే తాజా ఎన్నికల్లో 1.72 లక్షల మంది ఓటర్లు అదనంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే క్రమంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 86 శాతం దాటింది. సర్వేలు, పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఏ అభ్యర్థిగా కూడా ఐదు వేల నుంచి 15 వేలకు మించి మెజార్టీతో గెలిచే అవకాశాలు లేవు. పెరిగిన ఓటర్లు ఎవరికి అనుకూలంగా ఓటు వేశారు..? ఇదే జిల్లా అంతటా ప్రధాన చర్చగా మారింది.

గతం కంటే పెరిగిన పోలింగ్:

పల్లె, పట్నాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి నిల్చొని ఓటు వేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు సహజంగానే ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే వెళ్తుంది. అయితే.. 18-19 ఏళ్ల యువ ఓటర్లు 65,067 మంది ఉన్నారు. తొలిసారి ఓటు వేయాలనే ఆసక్తితో.. గంటూరు, విజయవాడ, హైదరాబాదు ప్రాంతాల్లో చదువుకుంటున్న యువత, బెంగళూరు వంటి ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువత స్వగ్రామాలకు వచ్చి 85-90 శాతం తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంది. 2019 ఎన్నికల్లో జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో 13,97,490 మంది ఓటు వేస్తే.. తాజా ఎన్నికల్లో 13న పోలింగ్ రోజు 15,70,007 మంది ఓటు వేశారు. అంటే.. 1,72,517 మంది అధికంగా ఓటు వేశారు. వీరిలో యువత, ఉద్యోగ, వ్యాపార వర్గాలే ఎక్కువ శాతం ఉన్నారని, వారంతా మెజార్టీగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ కూటమికి అనుకూలంగా ఓటు వేసి ఉంటారని రాజకీయ విశ్లేషకుల అంచనా. అలాగే.. గత ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 18,60,285 మంది ఉంటే.. ఈ ఎన్నికల్లో 20,54,563 మంది ఉన్నారు. అంటే 1,95,278 మంది ఓటర్లు పెరిగారు. కొత్తగా నమోదైన ఓటర్లలో 87 శాతం ఓటు వేయడం కొసమెరుపు.

టీడీపీ కూటమి వైపే ఉద్యోగులు:

ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వంగా జగన్ ప్రభుత్వానికి ముద్ర పడింది. దీంతో వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. ఆ కసితోనే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు పోటెత్తారు. రికార్డు స్థాయిలో 91.30 శాతం ఓటింగ్ పోస్టల్ ఓటింగ్ నమోదైంది. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం 22,615 మంది దరఖాస్తు చేసుకోగా 19,344 మంది అర్హత కలిగిన పీబీ ఓటర్లను గుర్తించారు. వీరికి ఓటేసేందుకు ఈ నెల 6,7,8,9వ తేదీలలో అవకాశం కల్పించారు. 17,661 మంది ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి క్యూలో నిల్చొని ఓటు వేశారంటే.. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టం అర్థమవుతోందని అంటున్నారు. పోస్టల్ ఓటేసిన ఉద్యోగుల్లో 85 శాతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులే కాదు.. ఉద్యోగ సంఘాల నాయకులు కూడా అంటున్నారు.

ఇల్లు దాటిన ఓటర్లు:

ఓటేసేందుకు నగర, పట్టణ వాసులు ఆసక్తి చూపారు. గతంలో ఇల్లు దాటని నగర ఓటర్లు ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని క్యూలో నిల్చొని ఓటు వేయడం మార్పుకు సంకేతమని స్పష్టమవుతోంది. కర్నూలు నగరంలో ఉద్యోగులు, యువత, వ్యాపార వర్గాలు అధికంగా ఉండే వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, ఎన్ఆర్ పేట, ఎ. క్యాంప్, బీ క్యాంప్.. వంటి ప్రాంతాల్లో గత ఎన్నికల్లో 35-40 శాతం కూడా పోలింగ్ నమోదు కాలేదు. ఈ ఎన్నికల్లో 55 శాతం వరకు పోలయ్యాయి. అదే క్రమంలో ఆదోని పట్టణంలో ఎస్కేడీ కాలనీ, ఎన్జీఓ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో గత ఎన్నికల్లో ఏనాడు 45 శాతం పోలింగ్ దాటలేదు. 13న జరిగిన పోలింగ్ రోజున 55-60 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం కొసమెరుపు. పాణ్యం నియోజకవర్గంలోని కర్నూలు అర్బన్ 16 వార్డుల్లో ఉద్యోగులు, యువత, వ్యాపార వర్గాలు అధికంగా ఉండే వార్డులు, ఎమ్మిగనూరు పట్టణంలో కూడా ఆ వర్గాలు ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఇది మార్పుకే సంకేతమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎవరి లెక్కలు వారివే..

డోన్‌లో ఫలితాలపై ప్రధాన పార్టీల బేరీజు

డోన్, మే 15: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో అప్పుడే ఫలితాలపై డోన్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు లెక్కల్లో మునిగి తేలుతున్నాయి. గెలుపుపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ అంచనాలతో తలమునకలవుతున్నారు. దీంతో ఎక్కడా చూసినా అభ్యర్థుల గెలుపు పైనే జోరుగా చర్చలు సాగుతున్నాయి. టీడీపీ కూటమి డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బరిలో నిలిచారు. ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి టీడీపీ నాయకులు గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ శాతం భారీగా నమోదు కావడంతో టీడీపీ అభ్యర్థికి కలిసొస్తుందని అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో ఆయా మండలాల్లో టీడీపీకి వచ్చే మెజారిటీపై లెక్కలు వేస్తున్నారు. డోన్ రూరల్ నుంచి టీడీపీ అభ్యర్థికి రూ.5 వేల వరకు మెజారిటీ రావచ్చని అంచనా.. ప్యాపిలి మండలం నుంచి మూడు వేలపైనే మెజారిటీ వస్తుందని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. డోన్ అర్బన్‌లో వైసీపీకి వెయ్యి నుంచి 1500ల వరకు మెజా ర్టీ రావచ్చని లెక్కలు కడుతున్నారు. బేతంచెర్ల మండలంలోనూ వైసీ పీకి రెండు వేల వరకు మెజారిటీ రావచ్చని అంచనా వేస్తున్నారు. కూడి కలు, తీసివేతలను బట్టి టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఐదు వేలకు పైగానే మెజారిటీతో గెలుపు ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● **వైసీపీ లెక్కలు ఇవీ:** డోన్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గెలుపుపై వైసీపీ నాయకులు లెక్కలు వేస్తున్నారు. డోన్ అర్బన్‌లో వైసీపీకి మూడు వేల నుంచి ఐదు వేల మెజారిటీ వేస్తుందని లెక్కలు కడుతున్నారు. డోన్ రూరల్‌లోనూ వైసీపీకి రెండు వేల మెజారిటీ వస్తుందని అంచనా వేస్తున్నారు. బేతంచెర్ల మండలంలోనూ వైసీపీకి ఐదు వేల మెజారిటీపైనే వస్తుందని లెక్కలు వేస్తున్నారు. ప్యాపిలి మండలంలో టీడీపీకి మూడు వేల వరకు మెజారిటీ రావచ్చని అంచనా. ఈ లెక్కల ప్రకారం వైసీపీ అభ్యర్థి ఆరు వేలకుపైనే మెజారిటీతో గెలవవచ్చని ఆ పార్టీ నాయకులు లెక్కలు బేరీజు చేసుకుంటున్నారు. ఎవరి అంచనాలు ఎలా ఉన్నా అసలు ఫలితం రావాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

మమ అనిపించారు

సమస్యలపై చర్చించని అధికారులు



మండల సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంపీపీ

కొలిమిగుండ్ల రూరల్, మే 15: సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారులు మమ అనిపించారు. బుధవారం మండలకేంద్రమైన కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించగా ఎంపీడీవో సాయిక్రిష్ణ మినహా మండల స్థాయి అధికారులెవ్వరూ హాజరు కాలేదు. కింది స్థాయి సిబ్బందిని సభకు పంపడంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సైతం సమస్యలను ప్రస్తావించడానికి ఆసక్తి చూపలేదు. ఎండా కాలంలో తాగునీటి, విద్యుత్ తదితర సమస్యలు గ్రామాల్లో ఉన్నా సభలో ఏమాత్రం వీటిపై శ్రద్ధతో సమీక్షించలేదు. ప్రారంభమైన కొద్ది సేపటికే, సమస్యలు ఏమీ లేనందున సమావేశాన్ని ముగిస్తున్నామని ఎంపీడీవో ప్రకటించారు. దీంతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

టీడీపీ నాయకులకు బెయిల్ మంజూరు

డోన్, మే 15: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో పోలీసులు అరెస్టు చేసిన టీడీపీ నాయకులకు బెయిల్ మంజూరైంది. టీడీపీ నాయకులు సీమ సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఏకాంతరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనో హర్‌రెడ్డి, వీఆర్వో మల్లారెడ్డి బుధవారం పోలీసులు డోన్ కోర్టులో హాజరు పరిచారు. కేసు పరిశీలించిన జడ్జి బెయిల్ మంజూరు చేశారు. టీడీపీ తరపున న్యాయవాదులు శ్రీనివాసభట్టు, భాస్కర్‌నాయుడు, ఆంజనేయగౌడు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

డోన్, మే 15: డోన్ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆమె మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులతో మంత్రి బుగ్గన వేధింపులకు గురిచేసే సంస్కృతిని మానుకోవాలన్నారు. మంత్రి నియంతృత్వ పోకడలు నచ్చకనే సీమ సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి కుటుంబ సభ్యులు టీడీపీలో చేరడంతోనే మంత్రి బుగ్గన అరెస్టు చేయించారని మండిపడ్డారు. బేతంచెర్ల స్టేషన్‌లో మంత్రిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని, మంత్రిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ఆమె ప్రశ్నించారు.

పట్టుబడిన వాహనాల పరిశీలన

రుద్రవరం, మే 15: రుద్రవరం కలప డిపోలో ఆర్‌హెచ్ కేసుల్లో వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజర్ శ్రీకాంత్ పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిని వివిధ కేసుల్లో వివరాలు అడగడంతో పాటు కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఎక్కడ ఉన్నాయి? ఎవరు ఉపయోగిస్తున్నారు? అన్న కోణంలో వివరాలు అడిగారు. ఈ కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, సెక్షన్ ఆఫీసరు పాల్గొన్నారు.

'అటవీ సంరక్షణపై నిర్లక్ష్యం తగదు': అటవీ సంరక్షణపై నిర్లక్ష్యం తగదని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి అన్నారు. రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజను పరిధిలో రుద్రవరం, చెలిమ రేంజ్ పరిధిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తిపై దాడి.. తొమ్మిది మందిపై కేసు

రుద్రవరం, మే 15: మండలంలోని యల్లావత్తులకు చెందిన హరి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేసినట్లు బుధవారం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసిందని చెప్పారు. పోలింగ్ వద్ద జరిగిన ఘర్షణను బుధవారం మళ్లీ మాట మాటా పెరిగి ఘర్షణకు దిగారని చెప్పారు. ఈ మేరకు హరి ఫిర్యాదు మేరకు తుమ్మల కృష్ణతో పాటు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించండి'



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ కార్యకర్తలు

కొలిమిగుండ్ల రూరల్, మే 15: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో తాగునీటి సమస్య తీవ్రంగా మారినా అధికారులు పట్టించుకోవడంలేదని టీడీపీ కార్యకర్తలు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో సాయికిష్ణకు వారు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వైసీపీ సర్పంచ్, ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నా టీడీపీ సానుభూతిపరుల కాలనీల్లో నీటిని సరఫరా చేయడం లేదని వారు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ నిధులతో నీటి సరఫరా చేపడుతూ టీడీపీ సానుభూతి పరులపై కక్షగట్టడం తగదన్నారు. మా ట్యాంకర్లతో నీటిని ప్రజలకు సరఫరా చేస్తామని, పంచాయతీ బోర్ల నుంచి ట్యాంకర్లకు నీరు వదలాలని అడిగినా సర్పంచ్, అధికారులు స్పందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు గూడూరు మహేశ్వరరెడ్డి, డిష్ గోపాల్, బొట్టుస్వామి, బోయ రవి, వెంకటరాముడు, నాగార్జునరెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉయ్యాలవాడ

» నిలిచిపోయిన సచివాలయ, ఆర్బీకే భవన నిర్మాణ పనులు
» శిథిలావస్థలో కేసీ కెనాల్ చానళ్లు
» ఆగిన కుందూ నది విస్తరణ పనులు



బేస్‌మెట్ లెవెల్‌లో నిలిచిపోయిన ఉయ్యాలవాడ సచివాలయ భవన నిర్మాణం

ఉయ్యాలవాడ, మే 15: ఉయ్యాలవాడ మండలం గత ఐదేళ్ల పాలనలో ఎంతో వెనకబడి పోయింది. మండలంలో 21 గ్రామాలు, 45 వేల జనాభా ఉన్నారు. మండలం రైతాంగ ఆధారిత ప్రాంతం. ఈ ప్రాంతం కుందూనదిపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. మండలంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. సాగు తాగు నీరు లేక రైతులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు అందాల్సి సబ్సిడీలో వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు అందటం లేదు. దీనిపై ప్రత్యేక కథనం

జగనన్న కాలనీలు ఇలా..

2020లో మండలంలోని హరివరం, సర్వాయిల్లె, అల్లూరు, ఆర్.పాంపల్లె తదితర గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అందులో దాదాపుగా 500పైగా ఒకొక్కరికి సెంటున్నర చొప్పున ఇంటి పట్టాలు ఇచ్చారు. వీరికి 2021 గృహాలు మంజూరు చేశారు. ఆ పట్టా స్థలాల్లో నేటికి ఒక్క ఇళ్లనైనా పూర్తి చేయలేక పోయింది. లే అవుట్‌లలో ప్రస్తుతం కంపపొదలతో నిండి ఉన్నాయి.

నిలిచి పోయిన సచివాలయ, ఆర్బీకే భవన నిర్మాణాలు

మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకే భవన నిర్మాణాలు నిలిచి పోయాయి. 2020లో మండలంలో 11 సచివాలయాలు, 11 ఆర్బీకే, హెల్త్‌సబ్ సెంటర్ల భవనాలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఐదేళ్లలో కేవలం ఏడు సచివాలయాలు, మూడు ఆర్బీకే భవనాలు మాత్రమే పూర్తి చేయగలిగింది. 9 హెల్త్ సబ్ సెంటర్లు నిర్మించలేక పోయారు.

శిథిలావస్థలో ఓహెచ్ఎస్సార్ ట్యాంక్‌లు, ఆర్వో ప్లాంటులు

మండలంలోని ఆయా గ్రామాల్లో ఓహెచ్ఎస్సార్ ట్యాంక్‌లు, ఆర్వో ప్లాంటులకు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని కాకరవాడ, ఆర్.పాంపల్లె గ్రామాల్లోని ట్యాంకులు సిమెంటు, కంకరలేచిపోయి కడ్డీలు బయటపడి దెబ్బతిన్నాయి. 2017లో అప్పటి ఎంపీ ఎస్పీవై రెడ్డి మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం తన సొంత నిధులతో ఆర్వోప్లాంటులు ఏర్పాటు చేశారు. ఇవి పుచ్చకాయలపల్లె, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో పనిచేయడం లేదు. తాగునీటి కోసం ఆ గ్రామ ప్రజలు పక్క గ్రామాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. పనిచేయని ఆర్వో ప్లాంట్లకు ప్రభుత్వం మరమ్మతులు చేయకపోవటంతో అందులోని పరికరాలు తుప్పు పట్టిపోతున్నాయి. కొండుపల్లె, పడిగెపాడు గ్రామాల్లో ఆర్వోప్లాంటు నిర్మించలేదు.

వృథాగా ఉన్న ఎత్తిపోతల పథకాలు

టీడీపీ హయాంలో మండలంలోని మాయలూరు, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటిలో పెద్దయమ్మనూరు మినహా ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, మాయలూరు ఎత్తిపోతల పథకాలు పనిచేయటం లేదు. వీటి మరమ్మతులకు అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించినా వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేకపోయింది. దీంతో వేల ఎకరాలు సాగునీరు అందించలేక పోయారు. ఇవి మరమ్మతులకు నోచుకోకపోవటంతో అందులోని మోటర్లు, విద్యుత్ పరికరాలు దెబ్బతింటున్నాయి.

దెబ్బతిన్న పంట కాలువలు

మండలంలోని పంట కాలువలు పూర్తిగా దెబ్బతిన్నారు. మండలంలో కేసీ కెనాల్, ఎస్సార్బీసీ పంట కాలువల ద్వారా దాదపుగా 3500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. పంటకాలువల లైనింగ్ దెడ్డతినటంతో సాగునీటి పారుదల కష్టంగా మారింది. దెబ్బతిన్న కాలువల మరమత్తులకు ప్రభుత్వం నిధులు కేటాయించలేక పోయింది. దీంతో మండలంలోని హరివరం, ఆర్.పాంపల్లె, కొండుపల్లె, ఉయ్యాలవాడ, ఇంజేడు, తుడుమలదిన్నె, మాయలూరు, పడిగెపాడు, అల్లూరు బోడెమ్మనూరు, కాకరవాడగ్రామ పంట పొలాలకు నీరు సరిగా అందటం లేదు.





హరివరం-ఇంజేడు గ్రామాల మధ్య దెబ్బతిన్న కేసీ కెనాల్ సబ్ చానల్, రూపనగుడి వద్ద నిలిచిపోయిన కుందూ నది విస్తరణ పనులు

ఆగిన కుందూ విస్తరణ పనులు..

మండలంలోని చాలా గ్రామాలు కుందూతీరంలో ఉన్నాయి. ఎక్కువగా వర్షాలు కురిసినప్పుడు వరదలు వస్తుంటాయి. దీంతో మండలంలోని 11 గ్రామాలు జలదిగ్బంలో మునిగిపోతున్నాయి. పంట పొలాలు నీటిలో మునిగి రైతులకు తీర నష్టం వాటిల్లుతోంది. దీని నుంచి రైతులకు విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం 2021లో కుందూ విస్తరణ పనులు చేపట్టింది. దీంట్లో భాగంగా బండిఆత్మకూరు మండలంలోని బానకచర్ల నుంచి కడప జిల్లా వరకు 189 కిలో మీటర్ల మేర కుందూనది విస్తరణకు రూ.1470 కోట్ల నిధులను మంజూరు చేసింది. కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని జోళదరాసి వద్ద ఒక టీఎంసీ సామర్థ్యంతో నీటిని నిల్వచేయటం కోసం ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంది. కుందూతీరం వెంట అక్కడక్కడా కొంత పని జరిగినా అవి అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో ఈ ప్రాజెక్టు ముందుకుసాగలేదు. రైతుల ఆశలు నీరుగార్చారు.

కనీస వసతులు కరువు

మండలంలోని చాలా గ్రామాలో ప్రజలకు కనీస వసతులు కరువు అయ్యాయి. కొండుపల్లె, ఆర్.పాంపల్లె, అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లో సీసీ రోడ్లు లేవు. చాలా గ్రామాల్లో శ్మశాన వాటికలు లేవు. మాయలూరు, తుడుమలదిన్నె, కొండుపల్లె, సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు, ఇంజేడు, పడిగెపాడు, నర్సిపల్లె, సుద్దమల్ల, రూపనగుడి ఎస్సీ కాలనీల్లో మురుగుకాలువలు లేవు. దీంతో మురుగనీరంతా సీసీ రోడ్లపైనే ప్రవహిస్తోంది. వర్షాకాలంలో ఈ కాలనీలు అన్నీ మురుగువాడల్లా దర్శనమిస్తున్నాయి.

మూగ జీవులకు దాహార్తి

కొలిమిగుండ్ల రూరల్, మే 15: ప్రభుత్వం, అధికారుల ముందుచూపు లేని కారణంగా వేసవి కాలంలో మూగ జీవులకు దాహార్తి తప్పడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరతతో ప్రజలు కష్టాలు ఎదుర్కొంటుండగా, గ్రామ పరిసర ప్రాంతాల్లో నీటి వనరులు లేక మూగ జీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. గత ప్రభుత్వాలు పశువులు, పక్షుల కోసం ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్ పథకాల ద్వారా గ్రామ పరిసరాలు, కొండల సమీప ప్రాంతాల్లో ప్రత్యేక తొట్లు నిర్మించి, వాటిని నీటితో నింపి వేసవి కాలంలో మూగ జీవుల దాహార్తిని తీర్చేవి. వైసీపీ ప్రభుత్వంలో వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ఎం డ కాలంలో గ్రామ పరిసర ప్రాంతాల్లో తిరిగే మూగ జీవులు దప్పికతో అల్లాడుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్టెలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.



శిథిలావస్థకు చేరుకున్న నీటి తొట్టి



నీటి తొట్టిలో దాహం తీర్చుకుంటున్న పశువులు (ఫైల్)

అధ్వానంగా రహదారులు



కంకర తేలిన బి. నాగిరెడ్డిపల్లె- పేరూరు రహదారి

రుద్రవరం, మే 15: మండలంలోని పేరూరు, బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య కంకర తేలి రహదారి అధ్వానంగా తయారైంది. పెద్దకంబలూరు, దక్షిణకొట్టాలు, శ్రీరంగాపురం, కోటకొండ గ్రామాల మధ్య కల్వర్టుల నిర్మాణం చేపట్టక రహదారులు గుంతలమయం కావడంతో పంట దిగుబడులు గ్రామాలకు చేరవేసుకోడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిత్తరేణిపల్లె- మిట్టపల్లె, ముకుందాపురం - తిమ్మనపల్లె, తిమ్మనపల్లె - నరసాపురం గ్రామాల మధ్య రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా రహదారుల నిర్మాణానికి మోక్షం లేదు. ఆలమూరు, ఓబులంపల్లె గ్రామాల మధ్య రహదారి గుంతలమయమైంది.



అధ్వానంగా దక్షిణ కొట్టాల - పెద్దకంబలూరు రహదారి

నిలువెత్తు నిర్లక్ష్యం



కింద పడిపోయిన కొలిమిగుండ్ల గ్రామ సూచిక బోర్డు

కొలిమిగుండ్ల, మే 15 : కొలిమిగుండ్ల గ్రామంలో కరెంట్ ఆఫీసుకు ఎదురుగా ఉన్న గ్రామ సూచిక బోర్డు కింద పడిపోయింది. ఆర్ అండ్‌బీ అధికారులు ప్రతి గ్రామానికి ఇరువైపులా కొద్ది దూరంలో రోడ్డపక్కన గ్రామ సూచిక బోర్డును ఏర్పాటు చేస్తారు. వాహనదారులు ఆ ఊరి పేరు ఈ బోర్డు ద్వారా తెలుసుకుంటారు. గత ఏడాది డిసెంబరులో కొలిమిగుండ్ల మండలానికి అవుకు జలాల సరఫ రా చేసే పైపులైను కొలిమి గుండ్ల జడ్పీహెచ్ స్కూల్ వద్ద నుంచి బెలుం గుహల వరకు అధికారులు పాతపైపులు తొలగించి కొత్త పైపులు వేశారు. ఆ సమయంలో కరెంట్ ఆఫీస్‌కు ఎదురుగా ఉన్న కొలిమిగుండ్ల గ్రామ సూచిక బోర్డును తొలగించి పక్కన వేశారు. సుమారు 3 నెలలు గడుస్తున్నప్పటికీ తిరిగి దానిని యథాస్థానంలో ఏర్పాటు చేయలేదు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, మే 15: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన కె. జితిన్ జయస్వామి దంపతులు రూ. 1,00,558 విరాళంగా అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకుడు జి.రవికి అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్, ఈవో

చాగలమర్రి, మే 15: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య పోస్టరును ఆవిష్కరించారు. ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఈవో నర్సయ్య తెలిపారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, మాధవాచార్యులు పాల్గొన్నారు.

తలనీలాల ఆదాయం రూ.13.8 లక్షలు: మండలంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాలకు సంబంధించి ఏడాదికి గాను తలనీలాలకు నిర్వహించిన వేలం పాటలో రూ.13.8 లక్షలు ఆదాయం వచ్చిందని ఈవో నర్సయ్య తెలిపారు. బుధవారం తలనీలాల వేలం పాటను పర్యవేక్షణాధికారి నరసింహసింగ్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. పాటదారుడు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. పాట దారుడు మునిశేఖర్ పాటను దక్కించుకున్నాడు. ఏడాది పాటు ఆలయాల్లో తలనీలాల వెంట్రుకలను పోగు చేసుకునేందుకు హక్కు కల్పించామని ఈవో చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ అధికారి రామ్మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి'



మాట్లాడుతున్న ఏపీవో నిర్మల

చాగలమర్రి, మే 15: గ్రామాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఏపీవో నిర్మల సూచించారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 16 రకాల పండ్ల తోటల సాగుకు ఉపాధి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మూడేళ్ల పాటు పండ్ల తోటల పెంపకానికి నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. 1,250 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని అన్నారు. కేసీ ప్రధాన కాలువలో పూడిక పనులు, పంట కాలువలు, చెక్ డ్యాముల్లో పూడికతీత పనులు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీఏలు పాల్గొన్నారు.

'వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి'

చాగలమర్రి, మే 15: గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. బుధవారం సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పర్యవేక్షణలో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని 13 సచివాలయాల పరిధిలో నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ 2024 నాటికి టీబీ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 16న టీబీ వ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక టీకాలు వేస్తున్నామని చెప్పారు. రెండువేల డోస్‌ల టీకాలు మంజూరయ్యాయని అన్నారు.

బనగానపల్లెలో 84.52 శాతం పోలింగ్

బనగానపల్లె, మే 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బనగానపల్లె నియోజకవర్గంలో 84.52 పోలింగ్ శాతం నమోదైంది. బనగానపల్లె నియోజవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాల్లో మొత్తం ఓట్లు 2,41,179 ఓట్లు ఉండగా ఇందులో 2,03,839 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 1,00,548 మంది పురుష ఓటర్లు, 1,03,286 మంది మహిళా ఓటర్లు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బనగానపల్లె మండలంలోని పసుపల గ్రామంలో 2,035 ఓట్లకు గాను 1,829 ఓట్లు, పెద్దరాజుపాలెంలో 1,015 ఓట్లకు గాను 861 ఓట్లు, బనగానపల్లె పట్టణంలో 30,116 ఓట్లకు గాను 23,170 ఓట్లు, క్రిష్ణగిరిలో 452 ఓట్లకు 414 ఓట్లు, చెర్లోకొత్తూరులో 477 ఓట్లకు గాను 448 ఓట్లు, గులాంఅలియాబాద్‌లో 1,142 ఓట్లకు 995 ఓట్లు, కటికవానికుంటలో 521 ఓట్లకు గాను 488 ఓట్లు, ఎర్రగుడిలో 1,137 ఓట్లకు గాను 1,048 ఓట్లు, యనకండ్లలో 3,267 ఓట్లకుగాను 2923 ఓట్లు, బత్తులూరుపాడులో 523 ఓట్లకు గాను 492 ఓట్లు, మీరాపురంలో 1,708 ఓట్లకు గాను 1,507 ఓట్లు, వుశేనాపురంలో 858 ఓట్లకు 785 ఓట్లు, యాగంటిపల్లెలో 1,763 ఓట్లకు గాను 1,605 ఓట్లు, పాతపాడులో 1,147 ఓట్లకు గాను 1,049, సాధుకొట్టంలో 458 ఓట్లకు గాను 422, జోళాపురంలో 790 ఓట్లకు గాను 702 ఓట్లు, రాళ్లకొత్తూరులో 588 ఓట్లకు గాను 552 ఓట్లు, నిలువుగుండ్లలో 145 ఓట్లకు 143, జంబులదిన్నెలో 214 ఓట్లకు 204, తమ్మడపల్లెలో 779 ఓట్లకు 703 ఓట్లు, మిట్టపల్లెలో 438 ఓట్లకు 401 ఓట్లు, కైపలో 1,633 ఓట్లకు గాను 1,471 ఓట్లు, సంకలాపురంలో 259 ఓట్లకు గాను 240 ఓట్లు, పండ్లాపురంలో 383 ఓట్లకు 363 ఓట్లు, వెంకటాపురంలో 1,273 ఓట్లకు 1,190 ఓట్లు, పలుకూరులో 6,594 ఓట్లకు గాను 5,322 ఓట్లు, గోవిందిన్నెలో 663 ఓట్లకు గాను 600 ఓట్లు, రామకృష్ణాపురంలో 2,160 ఓట్లకు గాను 1,852 ఓట్లు, రామతీర్థంలో 1,898 ఓట్లకు 1,711 ఓట్లు, బీరవోలులో 1,376 ఓట్లకు 1,250 ఓట్లు, చెరువుపల్లెలో 2,069 ఓట్లకు గాను 1,901 ఓట్లు, నందివర్గంలో 2,188 ఓట్లకు గాను 1,978 ఓట్లు, తిమ్మాపురంలో 762 ఓట్లకు గాను 731 ఓట్లు, జిల్లెల్లలో 923 ఓట్లకు గాను 867 ఓట్లు, నందవరంలో 4,155 ఓట్లుకు 3,581 ఓట్లు, విఠలాపురంలో 277 ఓట్లకు 231 ఓట్లు, అప్పలాపురంలో 1,075 ఓట్లకు 925 ఓట్లు, కాపులపల్లెలో 509 ఓట్లకు గాను 464 ఓట్లు, ఇల్లూరుకొత్తపేటలో 3,065 ఓట్లకు గాను 2,616, గులాంనబీపేటలో 229 ఓట్లకు గాను 197 ఓట్లు, టంగుటూరులో 2,850 ఓట్లకు గాను 2,492 ఓట్లు పోలైనట్లు ఆర్ఓ తెలిపారు.

కొలిమిగుండ్ల మండలంలో 88.06 శాతం

కొలిమిగుండ్ల రూరల్: కొలిమిగుండ్ల మండలంలో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవడంతో రికార్డు స్థాయి పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 43,083 మంది ఓటర్లు ఉండగా 37,947 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 88.08 శాతం పోలింగ్ నమోదైంది. సంజామల మండలంలో 32,206 మంది ఓటర్లు ఉండగా 27,785 మంది ఓటు వేయడంతో 86.27శాతం పోలింగ్ నమోదైంది. బనగానపల్లె మండలంలో 85,051 ఓట్లు వుండగా 71,747 మంది ఓటు వేయగా 84.36 శాతం పోలింగ్ నమోదైంది. కోవెలకుంట్లలో 39,564 గాను 32,449 మంది ఓటు వేశారు. దీంతో 82.02 శాతం పోలింగ్ నమోదైంది. అవుకు మండలంలో 41,30 1 మంది ఓటర్లలో 33,648 మంది ఓటు హక్కు వినియోగించగా 81.47 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో బనగానపల్లె నియోజకవర్గంలో ఈఎన్నికల్లో రికార్డు స్థాయిలో 84.40శాతం పోలింగ్ నమోదైంది.

అవుకు మండలంలో 81.75 శాతం

అవుకు: అవుకు మండలంలో 81.75 శాతం పోలింగ్ నమోదైంది. సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. 81.75 శాతం ఓట్లు పోల్ అయినట్లు మండల రిటర్నింగ్ అధికారి అశోక్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలో 21 గ్రామపంచాయతీల్లో 42,582 మంది ఓటర్లు ఉండగా 34,809 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మంగంపేట 859 ఓట్లు పోల్‌కాగా మంగంపేట తండాలో 361 ఓట్లు, కునుకుంట్లలో 952 ఓట్లు ఇస్రా నాయక్ తాండాలో 762 ఓట్లు ఉప్పలపాడులో 1,674 ఓట్లు, జూనంతలలో 998 ఓట్లు, కొండమనాయిని పల్లెలో 1,045 ఓట్లు, రామాపురంలో 3,950 ఓట్లు, చెర్లోపల్లె 1,799 ఓట్లు , అవుకు పట్టణంలో 7,521 ఓట్లు, మెట్టుపల్లె 1,109 ఓట్లు, కోనాపురంలో 554 ఓట్లు, రామవరంలో 585 ఓట్లు, లింగంబోడులో 360 ఓట్లు, గోకులదిన్నె 481 ఓట్లు, అన్నవరం 375 ఓట్లు, వేములపాడులో 986 ఓట్లు గుళ్ళసింగవరంలో 1,136 ఓట్లు, నిచ్చెనమెట్లలో 516 ఓట్లు, చెన్నంపల్లె 1470 ఓట్లు, శివవరంలో 1138 ఓట్లు, సింగనపల్లెలో 1795 ఓట్లు, సంగపట్నంలో 1591 ఓట్లు సనుగొండ్ల లో 719 ఓట్లు, సుంకేనులలో 1,398 ఓట్లు కాశీపురంలో 675 మొత్తం 34,809 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం పెరగడంతో టీడీపీకే లాభం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)